క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు



టీచర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, టీచర్లు

కదిరి: సున్నపుగుట్టతండా ఎంపీపీ స్కూల్‌లో ఎస్‌జీ టీచర్‌గా పని చేస్తూ.. తనకల్లు మండలానికి బదిలీ అయిన ఎద్దుల రజితమ్మను శుక్రవారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ చెన్నకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీతో పాటు పదవీ విరమణ సాధారణమన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన టీచర్లు, ఉద్యోగులకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం ఆ పాఠశాలకు బదిలీపై విచ్చేసిన టీచర్లు పిడుగు శ్రీనివాసులు, అనూషను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, టీచర్లు అనిత, శ్రీదేవి, మనోహర్, సీఆర్‌ఎంటీ మనోహర్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన పుట్టపర్తి మండలం పెడపల్లి పెద్ద తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దతండాకు చెందిన రాజునాయక్ తోపుడు బండిపై కాయలు, పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఇంట్లో లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేలోపు ఇంట్లో వస్తువులు, బియ్యం, బట్టలు, టీవీ, బీరువా, బంగారు కమ్మలు, చైను, కొంత డబ్బు కాలిపోయింది.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అచ్చిరెడ్డి గారి పాపిరెడ్డి (83) శుక్రవారం మృతి చెందారు. ఈయన మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు తన సొంత భూములను విరాళంగా అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రంథాలయం, ప్రాథమిక పాఠశాలలను విరాళంగా ఇచ్చిన భూముల్లోనే నిర్మించారు. అంతేకాకుండా ఈయన తమ్ముడైన అచ్చిరెడ్డి గారి నాగిరెడ్డి (ఎన్‌ఆర్‌ఐ)తో కలసి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాపిరెడ్డి మృతిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌తో రైతులకు మేలు



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: రైతన్నలకు సాంకేతిక సేవలందించేందుకు వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రభుత్వం నిర్మిస్తోందని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన నియోజకవర్గ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ల్యాబ్‌లో సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల నాణ్యతను పరిశీలించి రైతుకు సరఫరా చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుబ్బారావు, ఏడీఏ సత్యనారాయణ, ఏఓలు శ్రీనివాసరెడ్డి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ సుజాత, కౌన్సిలర్ గిరిజమ్మ పాల్గొన్నారు.

యానిమేటర్‌ను తొలగించండి



సీఐ చిన్నగౌస్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

చెన్నేకొత్తపల్లి: మహిళా సంఘాల సభ్యుల డబ్బు కాజేసిన యానిమేటర్ సోమనాథ రెడ్డిని తొలగించాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ చిన్న గౌస్‌కు మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఒంటికొండలో ఉన్న 18 మహిళా సంఘాల ఖాతాల నుంచి రూ.3.50 లక్షలు యానిమేటర్ డ్రా చేసుకున్నాడన్నారు. సదరు యానిమేటర్ నుంచి తమ డబ్బులు ఇప్పించాలని కోరారు.

పెళ్లి బట్టల్లోనే వెళ్లి.. పింఛన్లు అందజేసి



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ రాజశేఖర్ నాయక్ (ఫైల్)

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రాజశేఖర్ నాయక్. అమడగూరు మండలం గోపాల్‌నాయక్ తండాలో వలంటీర్‌గా విధులు పని చేస్తున్నాడు. వలంటీర్ రాజశేఖర్ నాయక్‌కు 2020 జూన్ 1వ తేదీన పెళ్లి నిశ్చయమైంది. పెద్దలు అనుకున్నట్టుగానే 1వ తేదీ ఉదయం 6 గంటలకు పెళ్లి జరిపించారు. తాళి కట్టడం, తలంబ్రాల తంతు ముగియగానే వలంటీర్ పెళ్లి దుస్తులతోనే పింఛన్లు పంపిణీ చేసేందుకు వెళ్లాడు. అతడికి కేటాయించిన 50 ఇళ్లలోని లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఠంచన్‌గా 1వ తేదీనే పింఛన్ అందుతుందని లబ్ధిదారులంతా ఎదురు చూస్తుంటారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదనే ఉద్దేశంతో పింఛన్లు పంపిణీ చేసినట్లు వలంటీర్ పేర్కొన్నాడు.

– అమడగూరు:

వలంటీర్లకు వందనం

రాజశేఖర్ నాయక్ సేవలు సూపర్..



మా ఇళ్లకు కేటాయించిన వలంటీర్ రాజశేఖర్ నాయక్ చాలా బాధ్యతగా పని చేస్తాడు. ఎవరైనా పెళ్లి జరిగితే మరుసటి రోజు పింఛన్ ఇద్దాం అనుకుంటారు. కానీ మా వలంటీర్ పెళ్లి అయిన రోజే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్ అందజేశాడు. చాలా సంతోషంగా అనిపించింది. ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తాడు. సమస్యలను తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాడు. ఏ సమస్య వచ్చినా మేం అతడినే సంప్రదిస్తాం.

– పార్వతమ్మ, గోపాల్‌నాయక్ తండా

ఆపదలో అండగా..



ఇంటింటికీ అందజేసేందుకు కూరగాయలను సిద్ధం చేస్తున్న వలంటీర్ సురేష్ (ఫైల్)

అమడగూరు మండలం రెడ్డివారిపల్లికి చెందిన వలంటీర్ పేట సురేష్ కరోనా సమయంలో సేవ చేసేందుకు ముందుకొచ్చాడు. 2020 ఏప్రిల్‌లో కరోనా విజృంభించడంతో కేంద్ర ప్రభుత్వం 21 రోజులు లాక్‌డౌన్ విధించింది. నిత్యావసరాలు కావాలన్నా దుకాణాలు తెరవని పరిస్థితి. అలాంటి సమయంలో వలంటీర్ సురేష్ తనవంతు సాయం చేయాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా టెంపో బాడుగకు తీసుకున్నాడు. వేకువ జామునే కర్ణాటక ప్రాంతం బాగేపల్లికి వెళ్లి రూ.23 వేలతో కూరగాయలు కొనుగోలు చేశాడు. గ్రామంలోని 230 కుటుంబాలకు పది రోజులకు సరిపడా కూరగాయలను ఉచితంగా అందజేసి ప్రజల మన్ననలు పొందాడు.

– అమడగూరు:

ఆపద్బాంధవుడు మా వలంటీర్..



కరోనా ప్రారంభ సమయంలో లాక్‌డౌన్ విధించారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. వ్యవసాయం చేయాలన్నా కూలి చిక్కేది కాదు. అలాంటి సమయంలో వలంటీర్ సురేష్ మాకు ఆపద్బాంధవుడిలా మారాడు. పది రోజులకు సరిపడే కూరగాయలు, ఆకుకూరలు ఇంటి వద్దకు వచ్చి ఇచ్చాడు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ బాగుంది. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుల వద్దకే వెళ్లి పింఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వెంకటలక్ష్మమ్మ, రెడ్డివారిపల్లి

ఇన్‌చార్జ్ మంత్రిని కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మంత్రి గుమ్మనూరు జయరాంతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర శంకర్, పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ గోపి శుక్రవారం తెలిపారు. రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మండలంలోని దొన్నికోట పంచాయతీ డీ.రామాపురం ఎస్సీ కాలనీకి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో డి.శంకర, రేణుక, రామాంజినేయులు, రామాంజనమ్మ, లక్ష్మాదేవి, మహేష్‌బాబు, పెద్దక్క, విశ్వాంజి, నారాయణప్ప, గంగులమ్మ, రామచంద్ర, డి.గంగులమ్మ, ఎస్.నాగరాజు, గంగులయ్య, వీరనారాయణప్ప, రాములు, అంజినమ్మ, వారి కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీరికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయి నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రసూల్, సహకార సంఘం డైరెక్టర్ గోపాల్‌నాయుడు, నాగరాజు నాయుడు, బాలాజీ నాయుడు, కమలాకర్ నాయుడు, ఆసాది ఆదినారాయణ, డీలర్ రమణ, అశ్వర్థనాయుడు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.20 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా రోడ్డు పనులు చేపడుతున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ తోట లక్ష్మిని అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అంతకుముందు వారు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాబాయి, నాయకులు లింగాల మధుసూదనరెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, ఎస్టీ సెల్ నాయకులు కృష్ణా నాయక్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాణికంఠనాయక్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పరామర్శ

తనకల్లు: మండల పరిధిలోని మబ్బువారిపల్లిలో ఇటీవల పురుగుల మందు సేవించి కామేశ్వర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే గందోడివారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త హరి తండ్రిని పరామర్శించారు. కార్యక్రమంలో కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసుల నాయుడు, శ్రీహరిరెడ్డి, దొరస్వామి, మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి, ఆది, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తనకల్లు: మండల పరిధిలోని రాచువారిపల్లి కాలనీకి చెందిన తిరుపతి (చిన్నా) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఆ మొత్తాన్ని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశాయి శ్రీకంఠారెడ్డి చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రామ్‌దేశాయ్, వినోద్‌కుమార్, నాయకులు సమరసింహారెడ్డి, గౌడచెర్వు రాజశేఖర్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, శ్రీనివాసులు, కుమార్ పాల్గొన్నారు.

నివాళి

నల్లచెరువు: మండల పరిధిలోని పల్లెవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బంద్రేవు నారాయణరెడ్డి (80) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శుక్రవారం గ్రామానికి విచ్చేశారు. నారాయణరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం



సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అనంతరూరల్ స్కూల్, వడ్డెర వీధిలో గుడ్ మార్నింగ్–ధర్మవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్లలో పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం, గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హత ఉండి ఏ కారణం చేతనైనా పథకాలు అందకుండా ఉంటే అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు సాకే గోపాల్, ఈడిగ కృష్ణ, అరుణ, సంద్రా రామకృష్ణ, వెంగన్న, కుమ్మర వెంకటరమణ, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం అర్బన్: నియోజకవర్గంలో ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 20వ తేదీ వరకూ ఓటరు సర్వే కొనసాగుతుందన్నారు. తొలగింపులు, మార్పులు, చేర్పులు, తదితర అంశాల్లో బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే బీఎల్‌ఓలకు ఓటరు సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 01.01.2024 నాటికి 18 సంవత్సరాలు వయసు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఫారం–6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫారం–7లో తొలగింపులు,, ఫారం–8లో సవరణలు, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని సూచించారు. ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో ఓటుకు ఆధార్ లింక్ 98 శాతం పూర్తి చేశామన్నారు. ఓటు సర్వేకు ప్రజాప్రతినిధులు సహకరించాలని తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు అందితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యుగేశ్వరి దేవి, తాడిమర్రి ఉప తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఉప ఎన్నికల తహసీల్దార్ అనిల్‌కుమార్ రెడ్డి, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని పి కొత్తపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో శ్రీనివాసులు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన ద్విచక్ర వాహనంలో పెడబల్లి డ్యాంకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పి.కొత్తపల్లి గ్రామ సమీపంలోకి వెళ్లగానే.. బెంగళూరుకు వెళ్తున్న ఓ కారును ఎదురుగా వెళ్లి ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాసులు ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని వైద్య సేవల నిమిత్తం 108లో రాయచోటికి తరలించారు.

దళితుల పక్షపాతి సీఎం జగన్



వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రశాంతి నిలయం: దళితుల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొనియాడారు. 1954 సంవత్సరం తరువాత 20 ఏళ్ల పాటు అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములపై సర్వహక్కులు భూ యజమానులకే దక్కేలా ఇటీవల కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవడంతో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. గణేష్ సర్కిల్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దళితులంత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ఫోటో సాయి, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పైపల్లి నరసింహులు, ఎస్‌టిడీ నరసింహులు, కేశప్ప, వరదరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు రంగప్ప, సాయినగర్‌కు చెందిన ఎస్సీ మహిళలు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలకు సన్మానం

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని శాస్త్రవేత్తలను శుక్రవారం జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ పరిశోధనలో దేశానికే ఈ పరిశోధనా స్థానం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ వేరుశనగ పరిశోధన, విత్తన అభివృద్ధి సంస్థగా జాతీయ వ్యవసాయ మండలి అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సన్మానం అందుకున్న వారిలో ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్, డా.ఏ ప్రసన్న రాజేశ్, డా.వేమన, చంద్రాయుడు, నీలిమ, వెంకటరమణ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యులు రవిచంద్రారెడ్డి, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభాలు



సూచనలు ఇస్తున్న అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్రీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సనావుల్లా, మండల బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. ఆర్బీకేల ద్వారా ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ చేయాలన్నారు. కంది, రాగి, ఉలవ, అలసంద తదితర విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. దీంతో పాటు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం రాగా సాగు విస్తీర్ణం పెంచాలని ప్రచారం చేస్తోందన్నారు. రాగి సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగన్న, ఏఓ వెంకటబ్రహ్మం, ఏఈఓ ఆనంద్‌నాయక్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జోరుగా ‘జగనన్న సురక్ష’



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ధర్మవరం, కదిరి పుట్టపర్తి నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. తనకల్లు మండల పరిధిలోని గందోడివారిపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. 1,024 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కదిరి మున్సిపల్ పరిధిలోని కంచుకోట, శివాలయం స్ట్రీట్, ఎంజీ రోడ్డు, వార్డు సచివాలయం, కే.బ్రాహ్మణపల్లిలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. తాడిమర్రి మండలంలోని చిన్నచిగుళ్లరేవులో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, పాల్గొన్నారు. బత్తలపల్లి మండలం తంబాపురం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఈఓఆర్డీ దివాకర్, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, పాల్గొన్నారు.

– సాక్షినెట్‌వర్క్:

వ్యాధులపై అప్రమత్తత అవసరం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబులంపల్లిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌డివిజనల్ అధికారి జయరాంనాయక్ తెలిపారు. శనివారం వైద్య ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ నివారణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని ఇండియన్ గ్యాస్ కార్యాలయం వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి సమీపంలో అక్రమంగా లారీలో తరలిస్తున్న 165 బస్తాల రేషన్ బియ్యం ప్యాకెట్లను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన సయ్యద్ ముస్తాక్, అహమ్మద్ బాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్.బసయ్య తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఏపీ పీజీసెట్‌లో సత్తా



గిరిజ



లక్ష్మి

కదిరి అర్బన్: ఏపీ పీజీసెట్‌లో కదిరి విద్యార్థినులు సత్తా చాటారు. పట్టణంలోని కుటాగుళ్లకు చెందిన గిరిజకు జువాలజీలో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంక్ వచ్చింది. అలాగే నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన లక్ష్మికి జువాలజీలో 7వ ర్యాంక్ సాధించింది. వీరిద్దరూ కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీజెడ్సీ గ్రూపులో డిగ్రీ పూర్తి చేశారు. ర్యాంకుల సాధనలో విద్యార్థులకు సూచనలిచ్చిన డిగ్రీ కళాశాల జువాలజీ లెక్చరర్ లక్ష్మీరెడ్డిని పలువురు అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కదిరి అర్బన్: మండల పరిధిలోని ముత్యాలచెరువు సమీపంలో శుక్రవారం కదిరి–హిందూపురం రహదారిపై విద్యుత్ స్తంభాన్ని ఓ సిమెంటు లారీ ఢీకొంది. వివరాలు.. లారీ బెంగళూరు నుంచి కడప జిల్లా యర్రగుంట్లకు వెళ్తోంది. ముత్యాలచెరువు వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. 30 అడుగుల దూరం వరకూ స్తంభాన్ని లాక్కెళ్లింది. రెండు అడుగుల మేర తీగలు పైన వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు వెనుక ట్యాంక్‌కు కొంచెం తగిలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు తెలిపారు.ఈ ఘటనలో అదృష్టవశాత్తూ డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

గంగమ్మ గుడికి విరాళం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉబ్బదేవర గంగమ్మ గుడికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి రూ.15 వేలు విరాళంగా అందజేశారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

నల్లచెరువు: మండల కేంద్రంలో శుక్రవారం పొగాకు నియంత్రణపై వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులతో కలసి ఎస్‌ఐ వరలక్ష్మి పలు కిరాణా షాపుల్లో తనిఖీలు చేపట్టారు. సిగరెట్, బీడీ వంటి పొగాకు పదార్థాలు సేవించడం వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వైద్యాధికారులు డాక్టర్ అయినుద్దీన్, డా.నాగార్జున రెడ్డి, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు

రామగిరి: మండల కేంద్రంలో ఎస్‌ఐ జనార్ధన్‌నాయుడు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సులు, రికార్డులు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రామగిరి మండలం చుట్టూ కర్ణాటక ప్రాంతం ఉండడంతో మద్యం తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్బీకేలను వినియోగించుకోండి

నల్లమాడ: ఆర్బీకేల్లో అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు కె.రవిచంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి సుమతి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సీజన్ల వారీగా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, చిరుధాన్యాలు ఆర్‌బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం రవిచంద్రారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు బొజ్జేనాయక్, ప్రసాద్, ఎంపీటీసీ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిప్రకాష్, హబీబుల్లా, మంగేనాయక్, సీతారాం, అశోక్‌యాదవ్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.